అద్భుతంగా లేకపోయినా బావుందనిపించింది.

"నాకు నచ్చింది" అన్నాడు బయటికొస్తూ. ఆమె వెంటనే ఇంటర్వ్యూ ప్రారంభించింది.

"మీరెక్కడ జాబ్ చేస్తారు?"

"ఎక్కడ దొరికితే అక్కడ" అనబోయి సర్దుకుని "రోడ్స్ అండ్ బిల్డింగ్స్ డిపార్టుమెంట్" అన్నాడు.

"నిరుద్యోగి" అంటే ఆమె బిగిసిపోయే అవకాశం వుంది.

"అందులో మీ డెజిగ్నేషన్ ఏమిటి?"

"సర్వేయర్! అన్నీ సర్వే చేస్తుంటాను. అంతా అవుట్‌డోర్ వర్కే."

"ఉద్యోగం పర్మనెంటేనా?"

"అలాగే కనబడుతోంది. అదే వచ్చిన ఇబ్బంది"

"అందులో ఇబ్బందేముంది?" ఆశ్చర్యంగా అందామె.

"మీరెంతమంది?" అడిగింది.

సురేష్ జాగ్రత్తగా ఆలోచించి సమాధానాలు చెప్పాలనుకున్నాడు.

ఇంటర్వ్యూలో ఇది చాలా కాంప్లికేటెడ్ పార్ట్.

"ఇద్దరు-ఓన్లీ టూ"

"ఎవరెవరు?"

చాలా జాగ్రత్తగా జవాబు చెప్పాలి దీనికి.

"నేనూ, ఆమె"        ఇంకా ఆమెనలా వదిలేస్తే తను దొరికిపోయే అవకాశం వుంది.

"మిమ్మల్ని ఇంతకుముందెన్నడో చూసినట్లు అనిపిస్తోంది. మీరు కూడా రోడ్స్ అండ్ బిల్డింగ్స్‌లో ఉద్యోగం చేసేవారా?"

"నేనెప్పుడూ ఉద్యోగం చేయలేదు" అందామె ఓ అడుగు వెనక్కు వేసి. డేగ కళ్ళు పావురాయి కళ్ళుగా మారిపోయాయ్.

"పోనీ మీ వారు..."

"ఆయన పోయి నాలుగేళ్ళయింది."

"లక్కీ ఫెలో"

ఆమె అర్థం కానట్లు చూసింది.

"అంటే.... అదే యాక్సిడెంట్ అయ్యాక మనిషి బ్రతికి వుండటం కంటే...."

"ఆయన పోయింది హార్ట్‌ఎటాక్ వల్ల"

"తప్పదు!"

మళ్ళీ అయోమయంగా చూసిందామె.

"ఏదొకరోజు అందరం...." అంటూ నవ్వాడు.

"అవును! ఈ రోజుల్లో మరీ ఎప్పుడేమవుతుందో"

"కరెక్ట్... కరెక్ట్."

"భార్య వర్కింగా?" మళ్ళీ డేగ కళ్ళు.

"అవును!"

"ఓ... అలాగా!" గొంతులో అసంతృప్తి స్పష్టంగా తెలిసిపోతోంది.

"వర్కింగ్ ఉమెన్‌కివ్వడం అంతగా...."

సురేష్‌కి అర్థమయిపోయింది. ఆ ఇల్లు దొరికినట్లే దొరికి చేయిజారిపోతోంది. అంతకుముందు వారం రోజుల్నుంచి హైదరాబాద్ అంతా ఇల్లు కోసం తిరుగుతున్నారు తనూ, తులసీ.

కానీ ఒక్క ఇల్లు కూడా నచ్చలేదు, దొరకలేదు. ఇంకొక్క మూడు రోజులు గడువు మాత్రం మిగిలివుంది-తులసి ప్రస్తుతం వుంటున్న ఇల్లు ఖాళీ చేయటానికి. ఆ తరువాత ఆమె రూమ్మేట్ దీప అందులోనే తన భర్తతో సంసారం ప్రారంభిస్తుంది. అంచేత ఈ ఇల్లు డెడ్‌లైన్....

"కానీ అది టెంపరరీ జాబ్. ఇంకో నెలరోజుల్లో క్లోజ్"

"ఓ-అలాగా" గొంతు ఇప్పుడు కొంత నయం.

"అదీగాక ఈలోగానే ఆ ఉద్యోగం రిజైన్ చేస్తోందిలెండి."

"ఓ ఎందుకని?"

"అదే... అదే ప్రెగ్నెంట్-ప్రెగ్నెన్సీ-అహ్హహ్హహ్హహ్హ."

ఆమె కూడా నవ్వేసింది.

"అలా అయితే సరే"

సురేష్‌కి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది.

థాంక్ గాడ్-

"ఇంతకూ మీ ఆఫీస్ ఎక్కడన్నారు?"

"ఎక్కడంటే...ఎక్కడంటే అదే మెయిన్ ఆఫీస్. రేపు సాయంత్రం వచ్చి ఇంట్లో దిగుతాం"

"మరి అడ్వాన్స్?"

"అడ్వాన్స్..అడ్వాన్స్......ఆ! బ్యాంక్ నుంచి డ్రా చేయాలి. రేపు సాయంత్రం....."

"అలా కుదరదండీ. పొద్దున్నే అడ్వాన్స్ యిచ్చి వెళితే-"

"సరే! ఓ.కే. పొద్దున్న తెచ్చిస్తాను."

సురేష్ బయటికొచ్చాడు. ఆమె కూడా గేటు వరకూ వచ్చింది.

ఆఖరి బాణం వదలాలి. ఆమె మళ్ళీ మాట్లాడకూడదు.

"ఈ చీర మీకు చాలా అందంగా అమరింది"

ఆమె ముఖం ఎర్రబడింది. కానీ కొంచెం అనుమానం కనిపించింది కళ్ళలో.

"ఎక్కడ కొన్నారో చెప్తే మా మిసెస్‌కి కూడా-"

మళ్ళీ ప్రసన్నత- పావురాయి చూపు.

"రాణి శారీ హౌస్‌లో"

"రాణి శారీ హౌస్-వండర్ ఫుల్ శారీస్. వస్తానండీ."

"రేపు ఉదయం....."

"షూర్........షూర్..."

వచ్చేశాడతను.

మర్నాడు ఉదయమే తులసి వుండే ఇంటికి చేరుకున్నాడు. దీప చీర ఇస్త్రీ చేసుకుంటోంది.

"సంసారం పెట్టాక యింక ఈ బాధ తప్పిపోతుంది మీకు, కదూ?"నవ్వుతూ అడిగాడు.

దీప చుర చుర చూసింది. ఇప్పుడే కాదు! మొదటినుంచీ అంతే!

"తులసీ" అంటూ తులసిని పిలిచింది.

తులసి వస్తూనే అతన్ని చూసి ఆశ్చర్యపోయింది.

"రా! కూర్చో"

"సంగతేమిటంటే ఇల్లు చూశాను-అంతా బాగానే వుంది. ఇప్పుడే అడ్వాన్స్ కట్టాలి."

"నేనూ ఒకటి చూశాను నిన్నరాత్రి. అదీ బాగానే వుంది. అయినా నువ్వు ఓకే చేశావు కాబట్టి- ఇదిగో డబ్బు కట్టేసెయ్" తన బ్యాగ్‌లోంచి రెండు వందలు తీసి యిచ్చింది.

"చాలా సిగ్గుగా వుంది-నీ దగ్గర డబ్బు తీసుకోవటం."

"పిచ్చిమాటలు మాట్లాడకు" కోపంగా అందామె.

"సాయంత్రం ఆ ఇంట్లోకి వెళ్ళిపోదాం!"

"సరే"

దీప లోపలి గదిలోకెళ్లటం చూసి తులసి దగ్గరకు జరిగాడతను.

"ఒక ముద్దు..."

"షటప్! ముందు వెళ్ళిక్కడినుంచి-దీప ఎదురుగ్గా."

"దీపా, ఆమె బాయ్‌ఫ్రెండ్ ఓసారి నీ ఎదురుగ్గానే..."

"అది వేరు. ఇది ఆమె ఇల్లు"

సురేష్ తిన్నగా గంగభవాని ఇంటికి చేరుకున్నాడు.

"అడ్వాన్స్ తెచ్చేశాను"

ఆమె ముఖంలో నిన్నటి ప్రసన్నత కనిపించలేదు. పావురాయి కళ్ళు మళ్ళీ డేగ కళ్ళయిపోయినయ్.

"మీకిల్లు ఇవ్వటం లేదు"

సురేష్ నవ్వేశాడు

"భలే తమాషాలు చేయగలరు మీరు. వారు ఎంతో ఎంజాయ్ చేసి వుంటారు. మీ కంపెనీ ......."

"మీరింక వెళ్లవచ్చు" తలుపులు మూయబోయిందామె.

"అరెరె- ఆగండి. ఏమిటిది? ఏం జరిగింది".

"మీరు చెప్పిన అబద్ధాలన్నీ బయటపడ్డాయ్".

"ఎలా "

"ఈ పక్క వాటాలో వుండే ఆనందరావ్ మిమ్మల్ని చూచారట నిన్న"

"చూడనీండి! చూస్తే తప్పేముంది? మనం యింకా ఏమీ చేయలేదుగా"

ఆమె ముఖం మళ్ళీ ఎరుపెక్కింది.

"ఆనందరావు కూడా రోడ్స్ అండ్ బిల్డింగ్స్ డిపార్ట్ మెంట్ లోనే పని చేస్తారు. ఆయన కూడా సర్వేయర్"

సురేష్‌కి అర్థమయిపోయింది.

ఇంక మాట్లాడటం వృధా.

"ఆనందరావుగారి భార్యను అడిగానని చెప్పండి. ఇద్దరం చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం! అసలు ఆమె కోసమే నేనీ ఇంట్లో వుండాలనుకున్నాను. సీక్రెట్ ఎఫెయిర్ కోసం !" వచ్చేశాడతను.

అతనికి చాలా నిరాశ కలిగింది. తులసిని ఎంత సుఖ పెట్టాలనుకుంటాడో అంత కష్టపెడుతుంటాడు. టైమ్ తొమ్మిదిన్నరయింది. పదిన్నరకి ఇంటర్వ్యూ. సురేష్ రన్నింగ్ బస్ ఎక్కాడు. సరిగ్గా పదకొండుగంటలకు చేర్చిందక్కడకి.

"మీరు రావలసింది పదిన్నరకి" అన్నాడు కళ్ళజోడతను కఠినంగా.

వీడికెట్లా దెబ్బకొట్టాలో తనకు తెలుసు. సురేష్ నవ్వాడు.

"అవును! నేను టైఫాయిడ్ జ్వరంతో పదిహేను రోజుల్నుంచీ మంచం మీదున్నాను! డాక్టర్ వెళ్ళొద్దని చెప్పాడు. అయినా వచ్చేశాను."

"ఐసీ! అయితే అలా నిలబడకండి. కూర్చోండి."

జాలి!

"థాంక్యూ"

కూర్చున్నాడతను. పక్కన కూర్చున్న వారంతా తనవంకే చూస్తున్నారు.

ఆఖర్లో కూర్చున్న అమ్మాయి కూడా - 32-24-30. వెంటనే తన పేరు పిలవటం వినిపించింది. ఇదంతా బాగా అలవాటున్న ప్రొసీజరే అంతా నార్మలే! పిలవటం, లోపల ఇంటర్వ్యూ చేసే పద్ధతి. మార్కులు వేయటం. రికమండేషన్ వున్న వాళ్ళనే సెలక్టు చేయటం.

"గుడ్ మార్నింగ్ సర్స్"

"ప్లీజ్ సిడౌన్"

కుర్చీలో కూర్చున్నాడు

"మీరు పోస్ట్‌గ్రాడ్యుయేటా?"

"అవును ! కాపీ కొట్టి పాసయ్యాను....."

అందరూ తలెత్తి చూశారు అతనివైపు . సురేష్‌కి తెలుసు అదంతా అనవసరపు కార్యక్రమం అని. ఉన్న వేకెన్సీలు ఆరొందలు. ఇంటర్వ్యూకి పిలిచింది అయిదువేలమందిని . ఇంటర్వ్యూ చేసేవాళ్ళు హైదరాబాద్‌వాళ్ళే. వాళ్ళమీద ఎన్నో అవినీతి ఆరోపణలుండేవి. ఇవి చాలు తను ఈ ఇంటర్వ్యూని ' వినోదవల్లరి' చేసే రుణానికి.

"కాపీ కొట్టారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును, ఒకటే ఒక్క పేపర్. మిగతావి మా కజిన్ రాశాడు నా పేరుతో."

మళ్ళీ నిశ్శబ్దం. మళ్ళీ నోరు తెరవకుండా సైలెన్స్ చేసేశాడు అతను.

"ఈ వుద్యోగానికే ఎందుకు రావాలనుకున్నావు?" ఇంకొకరు.

వీడి పని పట్టాలి యిక! వీడూ రెండో ప్రశ్న వేయకూడదు.

"బ్యాంక్ వుద్యోగాలయితే ఎక్కువ ఫ్రాడ్ చేయటానికి అవకాశాలుంటాయి కదండీ. వ్యాపారస్తుల దగ్గర ప్రభుత్వం డబ్బుతో మనం వ్యాపారం చేసుకోవచ్చు - మీకు తెలీందేముందీ?".

ముగ్గురూ మొఖ మొఖాలు చూసుకున్నారు.

మూడో అతను అనుమానంగానే అడిగాడు.

"నీ హాబీస్ ఏమిటి?"

దీనికి సరయిన సమాధానం చెప్తే నిజంగా వుద్యోగం ఇచ్చేస్తున్నట్లే పోజు.

"అందమైన అమ్మాయిలను సేకరించడం!" చాప్టర్ క్లోజ్! ఇంక చస్తే మరో ప్రశ్న వేయడు.

ముగ్గురి ముఖాల్లోనూ కోపం తాండవం చేస్తోంది.

"యూ ఆర్ గోయింగ్ అవుట్ ఆఫ్ వే మిస్టర్ ".

"నేనలా అనుకోవడం లేదు సార్! నాకు నిజం మాట్లాడటం ఇష్టం. నిజంతోపాటు

ఫ్రాంక్‌నెస్‌ని కూడా యిష్టపడతాను."

"నేనడిగిన ప్రశ్న మరోసారి విను. నీకు ఎక్కువ ఆసక్తి కలిగించే విషయం ఏది?" మళ్ళీ అడిగాను.

అంటే పాము ఇంకా చావలేదన్నమాట. ఈసారి చావు దెబ్బ కొట్టాలి. మళ్ళీ నోరు విప్పకూడదు.

"నీకు ఎక్కువ ఆసక్తి కలిగించే విషయం ఏది?" వండ్రఫుల్ ప్రశ్న.

"సెక్స్"

అదిరిపడ్డాడు అతను. కళ్ళల్లో మంట!

సురేష్ అక్కడితో ఆపలేదు. చిరునవ్వు నవ్వాడు. "ఒకేసారి ఇద్దరు అమ్మాయిలు పక్కనుంటే మరీ ఆసక్తికరంగా వుంటుంది".

అయిపోయింది ! ముగ్గురూ చేతులెత్తేసినట్లే.

"దిసీజ్ టూ మచ్"

"యూ కెన్‌గో........"

సురేష్ బయటికొచ్చేశాడు. చాలా సంతృప్తిగా వుంది అతనికి. వల్చర్స్, లంచాలు , రికమండేషన్లు. మధ్యలో ఫూల్స్ ఎవరు? అనేక వేలమంది సురేష్‌లు!